ప్రపంచస్థాయి ఫోటో కవితల పోటీకి

# జవాబు లేని ప్రశ్న

- అమరజ్యోతి

9182873598

ధాన్యాన్ని తూర్పార పడ్తున్నపుడు

గట్టి గింజ, తాలు గింజ సంగతి తెలుస్తుంది

గాలిలో కొట్టుకుపోవడం.. గాలికి ఎదురొడ్డి నిలబడ్డం

అన్నది ఒక జీవితకాల యుద్ధ సిద్ధాంతమైనపుడు

మనిషి ఒక వలసజీవై విచ్ఛిన్న మౌతున్నపుడు

వలసలు  కడుపు మండో, కడుపు నిండో అర్థం కాదు

అప్పుడే మనిషి ' మీమాంస ' ఔతాడు-

' ఆలుమగలు మాయ, అన్నదమ్ములు మాయ

తల్లిదండ్రులు మాయ, తాను మాయ '

అని వేమన గగనమెత్తు విస్తరించి ప్రబోధిస్తూనే ఉంటాడు-

మనిషి తనతో తాను సంభాషించడం నేర్చుకున్నాక

ప్రశ్ననుబట్టి జవాబు ఉంటుందనీ,

జవాబు లేని ప్రశ్న ఎప్పుడైనా

ఒక శూలమై భూమిలో నిట్టనిలువుగా పాతుకుపోయి ఉంటుంది-

మనసునిండా  మందరపర్వత మథనం జరిగీ జరిగీ

ముందు అందేది విషమే.. ఆ తర్వాతే అమృతం అని తెలుసుకుని

చేతులు రెండూ విశాలాకాశాన్ని కౌగలించుకుంటున్నపుడు

ఒక ' స్పృహ ' పొటమరిస్తుంది ఆత్మలో

గుడిసెకైనా.. ఆకాశహర్మ్యానికైనా

పునాదిమాత్రం  భూమిలోనే.. మట్టిలోనే అని

* * *

మట్టికి ప్రాంతం, రాజ్యం.. దేశం.. ఖండం అన్న

ఈ ' అతికింపులు ' అవసరమా.. ఊం ?

ఇది నా స్వంత కవిత అని హామీ ఇస్తున్నాను - అమరజ్యోతి

అడ్రస్: అమరజ్యోతి, ఇం.నం: 665, సాయిబాబా టెంపుల్ దగ్గర, BRT కాలనీ, AMAL కాలేజ్ రోడ్, అనకాపల్లి- 531001 విశాఖ జిల్లా , ఇ.మెయిల్: postmantra17@gmail.com